అన్నదాతలకు ఏదీ భరోసా?

- పెట్టుబడి సాయం ఊసెత్తని కూటమి సర్కార్
- అందని రాయితీ వ్యవసాయ పరికరాలు
- విత్తనాలు, ఎరువులకు తప్పని ఇబ్బందులు



బత్తలపల్లి మండలం ముద్దనపల్లి వద్ద సాగు చేసిన వేరుశనగ పంట

బత్తలపల్లి: అన్నదాతలను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందింది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభమై ఇప్పటికే నాలుగు నెలలు పూర్తయినప్పటికీ 'అన్నదాతా సుఖీభవ' పథకం కింద రైతులకు రూ.20వేల పెట్టుబడి సాయం అందలేదు. కనీసం ఆ ఊసే ఎత్తడం లేదు. కలుపు నివారణ మందు, పంటను ఆశించే పురుగుల మందులు పిచికారీ చేసేందుకు స్ప్రేయర్లు కూడా రాయితీపై ఇవ్వడం లేదు. ప్రతి ఏటా వ్యవసాయశాఖ ద్వారా బీసీ రైతులకు 30 శాతం, ఎస్సీ, ఎస్టీ రైతులకు 90 శాతం రాయితీపై టార్పాయన్లు, స్ప్రేయర్లు, ఆయిల్ ఇంజిన్లు అందేవి. ఈసారి ప్రభుత్వం వాటిపై దృష్టి సారించలేదు.

గత ప్రభుత్వంలో ఆరంభంలోనే...

గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పకడ్బందీగా రైతు భరోసా పథకం అమలు చేసింది. సీజన్ ప్రారంభంలోనే పెట్టుబడికి ఇబ్బంది పడకుండా రైతు భరోసా మొత్తాన్ని బ్యాంకు ఖాతాలకు జమ చేసింది. పీఎం కిసాన్ కింద రూ.6 వేలు, వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.7,500 కలిపి ఏడాదికి రూ.13,500 మూడు విడతల్లో అందించింది.

అన్నదాతా సుఖీభవ ఎప్పుడో?

సీఎం చంద్రబాబు ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పథకాలతో అన్ని వర్గాల ప్రజలనూ ఊరించారు. సూపర్ సిక్స్‌లో ఒకటైన అన్నదాతా సుఖీభవ పథకం ద్వారా పెట్టుబడి సాయంగా ఏడాదికి రూ.20వేలు ఇస్తామని చెప్పారు. అధికారంలోకి వచ్చాక ఏ ఒక్క పథకంపైనా స్పష్టత ఇవ్వడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అప్పులు చేసి ఖరీఫ్ పంటలు సాగు చేసినా.. నేటికీ పెట్టుబడి సాయం ఊసెత్తడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకం నిధులు విడుదల చేసినా.. కూటమి ప్రభుత్వం తనవంతు నిధులు ఎందుకు విడుదల చేయడం లేదో అర్థం కావడం లేదని నిట్టూరుస్తున్నారు.

ధర్మవరం నియోజకవర్గంలో ప్రధాన పంటల సాగు (ఎకరాల్లో..)

మండలం	వేరుశనగ	కంది	ఆముదం
ధర్మవరం	10,100	7,425	341
ముదిగుబ్బ	10,227	11,620	327
బత్తలపల్లి	4,814	5,938	974
తాడిమర్రి	3,112	3,587	335

అధిక ధరలకు కొనుగోలు



రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్ప్రేయర్లు, టార్పాయన్లు, ఆయిల్ ఇంజిన్లు రాయితీపై సరఫరా చేయడం లేదు. దీంతో ప్రైవేటు వ్యాపారుల వద్ద అధిక ధరలకు కొనుగోలు చేసుకుంటున్నాం. రైతులకు పంట కాలంలో ఎంతగానో ఉపయోగపడే స్ప్రేయర్లు అయినా కనీసం 50 శాతం రాయితీతో సరఫరా చేయాలి. కూటమి ప్రభుత్వం అన్నదాతలకు అండగా నిలిచి సంక్షేమ పథకాలు అమలు చేయాలి.

–గోపాల్, రైతు, రాఘవంపల్లి, బత్తలపల్లి మండలం.

రైతులను ఆదుకోవాలి



ఎన్నికల సమయంలో కూటమి నాయకులు రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలి. టీడీపీ అధినేత చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు రూ.20 వేలు పంటలు సాగు చేసే సమయంలో పెట్టుబడి సాయం అందజేస్తామన్నారు. అధికారంలోకి వచ్చి వంద రోజులు దాటినా రైతులకు పెట్టుబడి సాయంపై ఎటువంటి ప్రకటనా చేయలేదు. ఖరీఫ్ పంటలకు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టాం.

– సింగమనేని సూర్యనారాయణ, రైతు, మాల్యవంతం, బత్తలపల్లి మండలం

అనుమతి రావాలి



రైతులకు రాయితీపై ఇచ్చే పరికరాల కోసం ప్రభుత్వం నుంచి అనుమతి రావాల్సి ఉంది. ప్రస్తుతం రాయితీతో కూడిన ఎలాంటి పథకాలూ ఇవ్వడం లేదు. విత్తనాలు, ఎరువులు మాత్రమే రాయితీపై అందించాం.

– ఓబిరెడ్డి, వ్యవసాయాధికారి, బత్తలపల్లి

క్లుప్తంగా

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



రికార్డులు పరిశీలిస్తున్న జడ్జి జయలక్ష్మి

కదిరి: విద్యార్థులు మాదకద్రవ్యాలకు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కదిరి సీనియర్ సివిల్ జడ్జి ఎస్.జయలక్ష్మి సూచించారు. బుధవారం పట్టణంలోని ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్‌ను జడ్జి తనిఖీ చేశారు. విద్యార్థులు మత్తుకు బానిస కాకుండా చూడాలని వార్డన్ దుర్గాప్రసాద్‌కు ఆదేశించారు. మెనూ ప్రకారం సరైన పౌష్టికాహారం అందించాలని సూచించారు. ప్రతి విద్యార్థీ రోజూ స్నానం చేసి శుభ్రంగా బడికి వెళ్లేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అంతకు మునుపు హాస్టల్ రికార్డులతో పాటు అన్ని గదులనూ జడ్జి పరిశీలించారు.

పలువురు అధికారుల బదిలీ

ఓడీచెరువు : మండల పరిషత్ కార్యాలయంలో పలువురు అధికారులు బదిలీ అయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఎంపీడీఓ వరలక్ష్మి కర్నూలు జిల్లా మద్దికెరకు, సూపరింటెండెంట్ పూలరెడ్డప్ప తనకల్లుకు, ఈఓపీఆర్డీ రాజశేఖర్ తనకల్లుకు, సీనియర్ అసిస్టెంట్ గజ్జెల శ్రీనివాసరెడ్డి పెనుకొండకు, జూనియర్ అసిస్టెంట్ వెంకటేశ్ కదిరికి బదిలీ అయ్యారు.

గాంధీ జయంతిని మరిచిన 'రెవెన్యూ'

నల్లమాడ: మండల కేంద్రంలో రెవెన్యూ అధికారులు బుధవారం గాంధీ జయంతి వేడుకలు మరిచారు. మిగతా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోనూ గాంధీ జయంతి నిర్వహించారు. అయితే రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఎవ్వరూ తహసీల్దార్ కార్యాలయం వైపు తిరిగి చూడలేదు. పూర్తిస్థాయిలో సెలవులో తీసేసుకున్నారు. స్వాతంత్ర్య సమరయోధుల పట్ల రెవెన్యూ అధికారులకున్న చిత్తశుద్ధి ఇదేనా అంటూ పలువురు చర్చించుకోవడం కన్పించింది.

స్వచ్ఛతా హీ సేవపై ర్యాలీ



తలుపులలో మానవహారం

తలుపుల : ఎంపీడీఓ కిరణ్‌మోహన్‌రావు, ఈఓపీఆర్డీ శకుంతల ఆధ్వర్యంలో బుధవారం తలుపులలో స్వచ్ఛతా హీ సేవపై ర్యాలీ నిర్వహించారు. మెయిన్ రోడ్డు, మూడు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించి, మానవహారంగా ఏర్పడ్డారు. స్వచ్ఛతా హీ సేవ వలన కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈఓ అబ్దుల్ మునాఫ్, సచివాలయ, వైద్య, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామసభలను విజయవంతం చేయండి

ఎన్పీకుంట: మండలంలోని 14 పంచాయతీలలో గురువారం గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మనోహర్‌బాబు, ఏపీఓ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల అధికారులు, ఆయా పంచాయతీల కార్యదర్శులు, సర్పంచులు, ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకొని గ్రామసభలను విజయవంతం చేయాలని కోరారు.

అంగన్‌వాడీల్లో ఒత్తిడిలేని విద్య



అవగాహన కల్పిస్తున్న కార్యకర్తలు

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో ఐసీడీఎస్ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఐసీడీఎస్ ఆవిర్భావం రోజు అక్టోబర్ రెండో తేదీ కావడంతో అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ గాంధీజయంతి వేడుకలు నిర్వహించి, ఐసీడీఎస్ సేవలను ప్రజలకు వివరించారు. 4 ఏళ్ల లోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపి ఒత్తిడి లేని విద్యను చదివించాలని తల్లులకు సూచించారు. ఆట పాటలతో కూడిన విద్యను నేర్పుతూ మంచి పౌష్టికాహారం అందజేస్తామని ఐసీడీఎస్ సీడీపీఓలు, సూపర్‌వైజర్లు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

5న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

గాండ్లపెంట: ఈ నెల ఐదో తేదీన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నారు. ఎంపీపీ గంగోజమ్మ అధ్యక్షతన ఎంపీడీఓ కార్యాలయంలో జరిగే సమావేశానికి మండల స్థాయి అధికారులు, కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఎంపీపీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, జిల్లా, మండల కోఆప్షన్ సభ్యులు హాజరు కావాలని ఎంపీడీఓ వెంకటరామిరెడ్డి కోరారు.

ఉపాధి పనులపై అవగాహన కల్పించండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటరమణ

తనకల్లు: ఉపాధి హామీ పనులపై కూలీలకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ వెంకటరమణ సిబ్బందికి సూచించారు. తనకల్లు పంచాయతీ కార్యాలయంలో బుధవారం సర్పంచ్ సరస్వతి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ 2025–26 సంవత్సరంలో చేపట్టబోయే ఉపాధి హామీ పనులను గుర్తించాలన్నారు. కూలీల సంఖ్యను పెంచాలన్నారు. అడిగిన చోట పనులు కల్పించడానికి సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ కృష్ణమూర్తిరెడ్డి, ఏపీఓ మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పితృపక్ష మహాలయ అమావాస్య

బత్తలపల్లి: మండలంలోని వివిధ గ్రామాల్లో నామదారులు బుధవారం పితృపక్ష మహాలయ అమావాస్యను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దివంగతులైన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల సమాధుల వద్దకు వెళ్లి పూజలు చేశారు. వారికి ఇష్టమైన ఆహార పదార్థాలను అక్కడ ఉంచి కార్యక్రమాలు నిర్వహించారు. హిందూ మత విశ్వాసాల ప్రకారం ఈ అమావాస్యకు ఎంతో ప్రాధాన్యత ఉంది. ఈ సమయంలో పూర్వీకులు భూలోకానికి వస్తారని వారి నమ్మకం. సమాధుల వద్ద పూజా కార్యక్రమాల అనంతరం వారి వారి ఇళ్లలో మృతి చెందిన వారి పేరిట నూతన వస్త్రాలు ఉంచి పూజాది కార్యక్రమాలు నిర్వహించి, పితృదేవతలను స్మరించుకున్నారు.

పారిశుధ్య కార్మికులకు సన్మానం



కనగానపల్లిలో పారిశుధ్య కార్మికులకు సత్కారం



నల్లచెరువులో సన్మానం అందుకున్న పారిశుధ్య కార్మికులు

నల్లమాడ: జాతిపిత మహాత్మ గాంధీ జయంతి సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ డుంగావత్ సునీతాబాయి గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి, కొబ్బరికాయ కొట్టి పూజ చేశారు. మండల పరిషత్ కార్యాలయ, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు. దొన్నికోట సచివాలయంలో సర్పంచ్ రాగినేని సరస్వతి, ఈఓఆర్డీ అమర్నాథరెడ్డి, కార్యదర్శి రాంమోహన్ తదితరులు గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇద్దరు పారిశుధ్య కార్మికులను ఘనంగా సన్మానించారు. అనంతరం స్వచ్ఛతా హీ సేవపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న 15 మంది జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సర్పంచ్ సరస్వతి చేతుల మీదుగా పెన్నులు, జామెట్రీ బాక్సులు అందజేశారు.

నల్లచెరువు: మండల కేంద్రం నల్లచెరువులోని సచివాలయం–1లో ఎంపీడీఓ శకుంతల, సర్పంచ్ పంచరత్నమ్మ, కార్యదర్శి వసుంధర ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్తున్న ఎంపీడీఓ శకుంతలతో పాటు మండల కేంద్రంలోని పారిశుధ్య కార్మికులను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో కార్యదర్శి కిషోర్ బాబు, సచివాలయ సిబ్బంది నాగమణి, విష్ణువర్ధన్, మధుశ్రీ, నూరుద్దీన్, విజయ్, ఫయాజ్, యోగేశ్వరి, మెహతాజ్, లక్ష్మి, సరస్వతి, పాల్గొన్నారు.

కనగానపల్లి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని గ్రామాలను స్వచ్ఛతగా ఉంచుకుందామని స్థానిక ప్రజాప్రతినిధులు తెలిపారు. మండల కేంద్రంలో బుధవారం గాంధీ జయంతి నిర్వహించారు. స్వచ్ఛతా హీ సేవా ముగింపు సందర్భంగా గ్రీన్ అంబాసిడర్లుగా ఉత్తమ సేవలు అందించిన పారిశుధ్య కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ అంకె పరిమళ, ఎంపీటీసీ భాస్కర గౌడ్, పంచాయతీ కార్యదర్శి సుధాకర్ రెడ్డి, డీఎల్‌డీఓ సిబ్బంది, పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి: జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని బుధవారం మండల వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. గాంధీ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. చెన్నేకొత్తపల్లి పంచాయతీ వారు పారిశుధ్య కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ ధనుశ్రీ, ఈఓఆర్డీ అశోక్‌కుమార్ నాయక్, కార్యదర్శి శ్యామల పాల్గొన్నారు.



చెన్నేకొత్తపల్లిలో..



దొన్నికోటలో కార్మికులను సన్మానించిన సర్పంచ్ సరస్వతి

స్వచ్ఛ పుట్టపర్తిగా తీర్చిదిద్దుదాం

పుట్టపర్తి టౌన్: అన్ని వార్డులనూ పరిశుభ్రంగా ఉంచి స్వచ్ఛ పుట్టపర్తిగా తీర్చిదిద్దుదామని మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబులపతి, కమిషనర్ ప్రహల్లాద పిలుపునిచ్చారు. పట్టణంలోని చిన్నపల్లి వద్ద ఉన్న జానకిరామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబుళపతి, కౌన్సిలర్లు, పలువురు టీడీపీ నాయకులు హాజరయ్యారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని మహాత్మా గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాల్లో మున్సిపాలిటీలో గ్రీన్ అంబాసిడర్లుగా ఉత్తమ సేవలు అందించిన పారిశుధ్య కార్మికులకు అధికారులతో కలసి పూలమాలలు, శాలువాలతో సత్కరించి మెమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాంధీజీ స్ఫూర్తితో మన ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునేందుకు పౌరులందరూ కృషి చేయాలన్నారు. కాలువలు, రోడ్లు, వీధులు శుభ్రం చేసేందుకు పారిశుధ్య కార్మికులు ఆరోగ్యాన్ని పణంగా పెట్టి మన ఆరోగ్యం కాపాడుతారన్నారని కొనియాడారు. ప్రజాప్రతినిధులను ఎలా గౌరవిస్తామో వారిని కూడా గౌరవించాలన్నారు.



పారిశుధ్యకార్మికులను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ వద్దు

ధర్మవరం: విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేయొద్దని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ కార్యాలయం నుంచి కాలేజీ సర్కిల్, అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ సాగింది. సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ, కోకన్వీనర్లు అయూబ్‌ఖాన్, ఆదినారాయణ, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న, సీపీఎం సీనియర్ నాయకులు ఎస్‌హెచ్ బాషా, నాయకులు మారుతి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు అన్ని రకాల ప్రయత్నాలూ చేస్తున్నాయన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటు పరం కాకుండా కాపాడాల్సిన బాధ్యత రాష్ట్రంలోని ప్రతి పౌరునిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీల సంఘం నాయకురాలు చంద్రకళ, సరస్వతి, పోతక్క, ఫాతిమా, సరస్వతి, రషీదా, మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు ముకుంద, బాబు, లక్ష్మీ ఓబులేసు, వెంకటరాముడు, వెంకటేష్, సూరి, ఆది తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న సీఐటీయూ నాయకులు

జేఎన్‌టీయూఏ సాఫ్ట్‌బాల్ జట్టులోకి సుశాంత్‌రెడ్డి

పుట్టపర్తి అర్బన్: త్వరలో నంద్యాలలో జరగనున్న సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్‌లో పాల్గొనే జేఎన్‌టీయూఏ జట్టులో పుట్టపర్తి సంస్కృతి విద్యాసంస్థ ఇంజనీరింగ్ విద్యార్థి సుశాంత్‌రెడ్డి చోటు దక్కించుకున్నాడు. జేఎన్‌టీయూఏ జట్టు శాంతిరాం కాలేజ్ ఆఫ్ ఫార్మసీతో తలపడనుంది. జట్టుకు ఎంపికై న సుశాంత్‌రెడ్డిని సంస్కృతి విద్యాసంస్థల యాజమాన్యం బుధవారం అభినందించింది.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు పెడపల్లి విద్యార్థి

పుట్టపర్తి అర్బన్: ఇటీవల అనంతపురంలో జరిగిన అండర్–17 వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబరచిన పుట్టపర్తి మండలం పెడపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థి జిలాన్‌బాషా రాష్ట్రస్థాయిలో జరిగే వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ విద్యార్థిని బుధవారం హెచ్‌ఎం వెంకటేష్, పీడీ సూర్యనారాయణ, తల్లిదండ్రులు అభినందించారు.

పరిశుభ్రత.. ఆరోగ్యానికి భద్రత

ఎన్పీకుంట: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే మన ఆరోగ్యం భద్రంగా ఉంటుందని ఎంపీడీఓ మనోహర్‌బాబు పేర్కొన్నారు. ఎన్పీకుంట–2 సచివాలయం వద్ద బుధవారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ అంజినమ్మ అధ్యక్షతన హరిత రాయబారులను సత్కరించారు. ముందుగా జాతిపిత మహాత్మ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఇంటింటికి వెళ్లి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని, తడి, పొడి చెత్తలను వేరు చేయడం, వ్యాధులు, దోమలు నివారణా చర్యలపై ప్రజలను చైతన్యం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ చంద్రశేఖర్, ఉపాధి హామీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శానిటేషన్ వర్కర్లకు వ్యాక్సినేషన్

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వచ్ఛతా హీ సేవలో భాగంగా శానిటేషన్ వర్కర్లకు, కార్యాలయం సిబ్బందికి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హుస్సేన్ ఆధ్వర్యంలో బుధవారం వ్యాక్సిన్ వేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ వి.శ్రీనివాసరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

బాపూజీ మార్గంలో పయనిద్దాం



ధర్మవరంలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న అవోపా సభ్యులు



గాంధీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ధర్మవరం/ ధర్మవరం అర్బన్/ బత్తలపల్లి: దేశ స్వాతంత్ర్యం కోసం జాతిపిత మహాత్మ గాంధీ శాంతి మార్గం ఎంచుకుని అహింస అనే ఆయుధంతో పోరాడారని, ఆయన చూపిన మార్గంలో అందరూ పయనించి ప్రశాంత వాతావరణంలో జీవిద్దామని వక్తలు పిలుపునిచ్చారు. ఆయన నమ్మిన సిద్ధాంతాలు అహింస, సత్యమేవ జయతే అని అన్నారు. బుధవారం ధర్మవరం, కదిరి, పుట్టపర్తి, రాప్తాడు నియోజకవర్గాల్లో గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రతి విద్యార్థి గాంధీ అడుగుజాడల్లో నడవాలని వివేకానంద డిగ్రీ కళాశాల డైరెక్టర్ లక్ష్మీనారాయణరెడ్డి, కరస్పాండెంట్ వాసవి భాస్కర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ హర్షవర్ధన్ తెలిపారు. ధర్మవరంలోని రేగాటిపల్లి రోడ్డులోని శ్రీ వివేకానంద డిగ్రీ కళాశాలలో బుధవారం గాంధీ జయంతి వేడుకల సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాంధీ ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వేణుగోపాలాచార్యులు తెలిపారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని ధర్మవరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం శ్మశాన వాటికలో సేవలందిస్తున్న వెంకటేష్, సాయి, లయన్స్ క్లబ్ సేవకుడు మధు, పాఠశాలలో సేవలు చేస్తున్న అంజినమ్మలను లయన్స్‌క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. గాంధీనగర్‌లో అవోపా ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రోటరీక్లబ్ ఆధ్వర్యంలో గాంధీజయంతిని పురస్కరించుకుని ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు బ్రెడ్లు, పాలు పంపిణీ చేశారు. కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బత్తలపల్లిలోని తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో గాంధీజీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముదిగుబ్బ మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ ఆదినారాయణ ఆధ్వర్యంలో గాంధీ జయంతి నిర్వహించారు. అనంతరం స్వచ్ఛతా హీ సేవలో భాగంగా పారిశుధ్య కార్మికులను సన్మానించారు.

జాతిపిత సిద్ధాంతాలు కాపాడుదాం

ఎన్పీకుంట/గాండ్లపెంట/తలుపుల/తనకల్లు/కదిరి టౌన్: జాతిపిత మహాత్మాగాంధీ సిద్ధాంతాలను ప్రతి ఒక్కరూ కాపాడాలని ఎంపీడీఓ మనోహర్‌బాబు అన్నారు. మండల కేంద్రం ఎన్పీకుంటలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం జాతిపిత హహాత్మాగాంధి జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రం–1లో కార్యకర్త శోభా ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. గాండ్లపెంట మండలంలోని పంచాయతీ కార్యాలయాల్లో గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. గాండ్లపెంటలో గ్రామసభ నిర్వహించి వచ్చే ఆర్థిక సంవత్సరంలో చేపట్టే ఉపాధి హామీ పనుల ప్రణాళిక తయారీపై అవగాహన కల్పించారు. తర్వాత స్వచ్ఛతా హీ సేవలో భాగంగా పంచాయతీల్లో పారిశుధ్య కార్మికులను సన్మానించారు. తలుపులలోని మూడు రోడ్ల కూడలిలో గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. తనకల్లు ఎమ్మార్సీ కార్యాలయంలో జాతిపిత గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు.

పట్టణంలోని రాణిపేట స్కూల్‌లో ఉన్న జాతిపిత మహాత్మ గాంధీజీ విగ్రహానికి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారథి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వజ్ర భాస్కర్‌రెడ్డి, లీగల్ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ లింగాల లోకేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో గాంధీ జయంతి నిర్వహించారు. కాంగ్రెస్, వివిధ ప్రజా సంఘాల నాయకులు సైతం గాంధీకి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పరికి సాదిక్ బాషా, గోపాలక్రిష్ణ, క్రిష్ణానాయక్ , కాంగ్రెస్ నాయకులు కదిరప్ప, భాస్కర్ పాల్గొన్నారు.



చిన్నారులతో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్



ముదిగుబ్బలో గాంధీకి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

రైతుకు పాము కాటు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని చిన్నూరు గ్రామానికి చెందిన రైతు సోమశేఖర్ బుధవారం సాయంత్రం తన పొలంలో వ్యవసాయ పనులు చేసుకుంటుండగా పాము కరిచింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు వెంటనే చికిత్సనందించారు. ప్రస్తుతం రైతు కోలుకుంటున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.